క్లుప్తంగా

గర్భగుడిలో వర్షపు నీరు



గర్భగుడిలో చేరిన వాన నీరు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ గర్భగుడిలోకి గురువారం నీరు చేరింది. అధిక వర్షాలతో పురాతనమైన ఆలయంలోకి నీరు చేరినట్లు భక్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భాష వ్యక్తీకరణలో 'ఫొనటిక్స్' కీలకం

ఇచ్చోడ: భాష వ్యక్తీకరణలో ఫొనటిక్స్ అనేవి విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగపడుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాష్ ఫొనటిక్స్ ఇన్ గుడ్ కమ్యూనికేషన్ అనే అంశంపై ఉపన్యాసం చేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రొఫెసర్ సుభాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దయాకర్, మధు, మురళి, నర్సయ్య, ప్రభాత్‌కుమార్, సరితారాణి, తిరుపతి, బాలకృష్ణ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఎస్‌డీసీ డీపీఎం జాదవ్ రమేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇండియా స్కిల్ కాంపిటేషన్ అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలు జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, చంద్రకాంత్, కునాల్, స్వప్న, అనిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టిన నార్నూర్ కేజీబీవీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కన్వీనర్ వి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో విద్యార్థులకు నాసిరకం భోజనం పెట్టడంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పురుగుల అన్నం తినలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ నిఖిల్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేతో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

అదిలాబాద్: ఉమ్మడి జిల్లాలో ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేఎల్పీ ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను పలువురు ముదిరాజ్ సంఘం నేతలు కలిశారు. గురువారం మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు, మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. వారు మాట్లాడుతూ లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో ముదిరాజుల సాంఘిక బహిష్కరణ కోసం వీడీసీ వారు చేస్తున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భీమన్న మందిరం వద్ద వెంటనే షెడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు దారవేణి రాము, ముదిరాజ్ కోశాధికారి బొజ్జ సంతోష్ ముదిరాజ్, ఓరుగంటి శ్రీనివాస్, భూమన్న, కొండ వెంకటి, దాసు, పాండురంగ ముదిరాజ్, ఈగల పొచ్చన్న కాందాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సిర్సన్న గ్రామానికి వెళ్లే 11కేవీ విద్యుత్ లైన్ మార్గంలో మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పశుపోషకులకు చేయూత

- 'ఉపాధి' నిధులతో పశువుల పాకల నిర్మాణం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



సిరికొండలో పశువుల పాక ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

సిరికొండ: రైతులు, పశుపోషకులు పశువుల కోసం సరైన వసతి కల్పించలేక నానా కష్టాలు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులు, పశుపోషకులు పశువుల కొట్టం నిర్మించుకునేందుకు ఉపాధిహామీ ద్వారా నిధులు మంజూరు చేస్తోంది.

ఉపాధిహామీ ద్వారా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా జాతీయ ఉపాధిహామీ, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాల కింద గ్రామాల్లో పల్లె పనుల జాతరను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతంలో రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై కూడా ఆధారపడుతుంటారు. కొందరికి కేవలం పశుపోషణే జీవనాధారం. కానీ వారు పోషించే ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలను పెంచుకోవడానికి, వాటికి సరైన వసతులు కల్పించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం పశువుల కోసం ఉపాధిహామీ పథకం నిధులతో పశువుల షెడ్లు మంజూరు చేస్తుంది. ఈ షెడ్లను నిర్మించుకునేందుకు గేదెల షెడ్డుకు రూ. 90 వేలు, గొర్ల షెడ్డుకు రూ.1.50 లక్షలు మంజూరు చేస్తున్నారు. అయితే మండలంలో అనేకమంది పాడి రైతులు ఉన్నప్పటికీ ఈ పథకం ద్వారా పశువుల పాకలు నిర్మించుకోవచ్చన్న విషయం చాలా మందికి తెలియదని కొందరు రైతులు పేర్కొంటున్నారు. అధికారులు ఈ పథకంపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ముందుకు రావాలి

పల్లెజాతర కార్యక్రమంలో భాగంగా పశువుల కొట్టం (షెడ్డు) నిర్మాణం కోసం పాడి రైతులు ముందుకు వస్తే మంజూరు చేస్తాం. ఉపాధిహామీ పథకం నిధులతో రైతులు పశువుల కొట్టాలు నిర్మించుకోవచ్చు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

– స్వరూప, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, సిరికొండ

అవగాహన కల్పిస్తున్నాం

పల్లెజాతర కార్యక్రమంలో భాగంగా పశువుల కోసం షెడ్లు నిర్మించుకునే వారికి అవగాహన కల్పిస్తున్నాం.ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తాం. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, పశువులు కానీ గొర్రెలు కానీ ఉన్న రైతులను ఎంపిక చేస్తున్నాం.

– భీంరావు, ఉపాధిహామీ ఏపీవో

కొట్టం నిర్మించా..

నాకు ఉన్న గేదెలకు సరైన వసతి లేదు. ఇంటి వద్ద కట్టేస్తే వర్షం పడితే ఇబ్బందిగా ఉండేది. వర్షంలో తడవడంతో జబ్బు పడేవి. ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల కొట్టం కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు మంజూరు చేశారు. వెంటనే కొట్టం నిర్మించడంతో పశువులకు సరైన వసతి దొరికింది.

– గోర్బండ్ లక్ష్మణ్, పశుపోషకుడు, సిరికొండ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీహెచ్‌వో బ్రహ్మానందరెడ్డి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ సీహెచ్‌వో బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దుబార్‌పేట్‌లో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో గర్భిణులు, బాలింతలకు, మధుమేహం, రక్తపోటు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జితేందర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వర్ చౌహన్, ఏఎన్ఎం తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం కుమారి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఆశ వర్కర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్‌రాజ్ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రాలు అందజేశారు. మండల విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, మేఘ, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుషి పంచమి ఉత్సవాలు



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



రాంసింగ్‌బాబా దర్శనం చేసుకుంటున్న సుగుణ

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్‌తండాలోని కాలుబాబా, పాచుబాబా, జ్వాలముఖి ఆలయంలో రుషి పంచమి ఉత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. మహరాజ్ రాంసింగ్ బాబా ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు హాజరై ఆలయంలో పూజలు చేసి రాంసింగ్‌బాబా దర్శనం తీసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మసుద్, మీర్జా యాకుబ్‌బేగ్, జహీర్, భక్తులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి..

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్‌తండా గ్రామంలో కలుబాబా మందిరంలో మధుర సమాజం ఆరాధ్య గురువులు ప్రేంసింగ్ మహరాజ్, ధర్యాసింగ్ మహరాజ్ అధ్వర్యంలో నిర్వహించిన రుషిపంచమి వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, కేవల్‌సింగ్, మాజీ సర్పంచ్ అనితరవీందర్, నానకసింగ్, లక్ష్మణ్, పత్తుసింగ్, మోహన్, రాజు, ఉత్తం, మారుతి, కిశోర్, గణపతి, భూమన్న, రాజారాం పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బేల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండలస్థాయిలో ఉత్తమ పురస్కారానికి ఎంపికైన 14మంది ఉపాధ్యాయులను, ఎమ్మార్సీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో కదం మహాలక్ష్మి, హెచ్ఎంలు సుదర్శన్, ఏలియా, రమేశ్, సతీశ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణకుమార్, టి.నరసింహా స్వామి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

బజార్‌హత్నూర్: ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందిన మండలంలోని చందునాయక్ తండా గ్రామానికి చెందిన చోపాడే సూరజ్ సింగ్‌ను గురువారం కలుబాబా మందిరంలో ప్రేంసింగ్ మహరాజ్ శాలువాతో సత్కరించారు. మధుర సమాజం నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడు ఉండటం గర్వకారణం అన్నారు. కైలాస్, నానకసింగ్, కేవల్‌సింగ్, సంతోష్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు..

నేరడిగొండ: ఇటీవల పదోన్నతి పొందిన నేరడిగొండ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు భూలత, కిష్టాపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు అంబారావ్‌లను ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు గంగాధర్, నూర్‌సింగ్, చంద్రశేఖర్, నజీబ్, మల్లీశ్వరి, సుధారాణి, జ్యోతి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఆదిలాబాద్: వినాయక చవితి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో మాలాధారణ చేసిన భక్తులు గురువారం పట్టణంలోని శ్రీ మహాగణపతి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. 11 రోజుల పాటు నియమనిష్ఠలతో మాల ధరించిన భక్తులు, కాణిపాకం వెళ్లి మాల విరమణ చేసిన అనంతరం ఆలయంలో కార్యక్రమాన్ని చేపట్టారు. తాలూకా మున్నూరుకాపు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు రవి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యం లేని చదువు వ్యర్థం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ప్రతీ విద్యార్థి నిర్ణిత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, గమ్యం లేని ప్రయాణం, లక్ష్యం లేని చదువు వ్యర్థమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ పార్టీకి హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి కళాశాలలో చేరే టప్పుడు లక్ష్యంతో చేరాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. ప్రిన్సిపాల్ ప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధన చేయాలి

తలమడుగు: ఉపాధ్యాయులు డిజిటల్ లెర్నింగ్ పెంపొందించుకొని విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి రఘురమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్య వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక తరగతులు బోధిస్తున్న కాంప్లెక్స్ ఉపాధ్యాయులు డిజిటల్ లెర్నింగ్‌పై నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. మండల విద్యాధికారి వెంకట్ రావ్, రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలను సస్పెండ్ చేయాలి



ప్రజలను సముదాయిస్తున్న ఎస్సై మధుకృష్ణ

బేల: విద్యుత్ సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఏఈ సంతోష్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని టాక్లీ, డో ప్పాల, మశాల(బి) గ్రామాల వాసులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ఆందోళన చేసి, ఆపరేటర్ మేషక్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత మూ డు రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. సమస్య పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. కాగా గ్రామస్తులను ఎస్సై మధుకృష్ణ సముదాయించారు. కొండయ్య, బన్కర్ రాకేశ్, గేడం రాము, డాక్రే ప్రవీణ్, యోగేశ్, రాకేశ్, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుదాం'



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు ఏచూరి స్ఫూర్తితో పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు రాఘవులు, అన్నమొల్ల కిరణ్, బండి దత్తాత్రి, మంజుల, స్వామి, జమున, శకుంతల, పంచపూల, గంగారాం, ఆశన్న, ఆరీఫా, గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన నచ్చి కాంగ్రెస్‌లో చేరికలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు



బోథ్‌లో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

బోథ్: ప్రజాపాలన నచ్చి నాయకులు, యువకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆడె గజేందర్ సమక్షంలో పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేశ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి, నాయకులు మహమ్మద్ కౌసర్, షేక్ షబీర్, అమీర్, కైపెల్లి రవి, చందు నాయక్, వివిధ పార్టీల నుంచి దాదాపు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా మండల కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. బోథ్‌లో రెవెన్యూ డివిజన్, ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల, గ్రంథాలయం, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఐసీసీ కాంగ్రెస్ విచార్ విభాగ్ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్, మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం..

నేరడిగొండ: జిల్లా పర్యటనకు వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఘన స్వాగతం పలికారు. గురువారం మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద పార్టీ నాయకులతో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. మండలంలోని కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కైలాస్‌నగర్: జిల్లా పర్యటనకు వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పట్టణ శివారులోని మావల బైపాస్ వద్ద పూల బొకే అందించి ఘనస్వాగతం పలికారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ పేరుతో సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించి, రిజర్వాయర్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ సంబంధిత అధికారులను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం గ్రామ కమిటీ మండల కన్వీనర్ ధోనిపిల్లి స్వామి మాట్లాడుతూ.. 2018లో రిజర్వాయర్ నిర్మాణం కోసం 1200 ఎకరాల సాగుభూములు సేకరించారన్నారు. అందులో 180 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించి కరకట్ట నిర్మాణం పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. మిగిలిన 1020 ఎకరాల భూమిని సేకరించి నష్టపరిహారం 2019లో ఎకరాకు రూ.8లక్షలుగా నిర్ణయించారన్నారు. కానీ ఇప్పటివరకు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోవడంతో పాటు ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అశోక్, పెంటన్న, నసీరుద్దీన్, తిరుపతి, స్వామి, నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రజాసంరక్షణలో భాగంగా 'కార్డెన్ సెర్చ్'



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ కాజల్ సింగ్

గుడిహత్నూర్: ప్రజాసంరక్షణకు కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీలు) నిర్వహిస్తున్నట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. గురువారం తెల్లవారుజామున మండలంలోని మన్నూరు ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోతో పాటు రెండు బెల్ట్‌షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలు, పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ కాజల్ సింగ్ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావద్దని, వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు అనుసరించి వాహనాలను నడపాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. నిర్బంధ తనిఖీల్లో ఇచ్చోడ సీఐ బండారి రాజు, గుడిహత్నూర్, ఇచ్చోడ ఎస్సైలు ఎల్. శ్రీకాంత్, పురుషోత్తం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: గ్రూప్–1 అవకతవకలపైన కమిషన్ వేసి బహిర్గతం చేసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు.

ఎలక్ట్రికల్ షాపు యజమాని రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఎలక్ట్రికల్ వైరు విక్రయించిన షాపు యజమానిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీచౌక్‌లో నకిలీ వి–గార్డ్ ఎలక్ట్రికల్ వైర్లు, గోల్డ్ మెటల్ ఎలక్ట్రికల్ సాకెట్లు విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. కంపెనీ ప్రతినిధులు వినియోగదారులుగా కృష్ణ ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లగా యజమాని దేవాసి హర్షవర్ధన్ నకిలీ ఎలక్ట్రికల్ వైర్లు అందించినట్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు

బోథ్: సొనాల మండల కేంద్రంతో పాటు ఘన్‌పూర్ గ్రామంలో గురువారం విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ కమిటీని ఏర్పాటు చేసి, సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ గ్రామంలో ఉన్న పిల్లల రక్షణ, సంక్షేమంపై పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. సోషల్ వర్కర్ రవి కాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగుబాయి ఉన్నారు.

14 నుంచి ప్రజావాణి

ఇచ్చోడ: ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జి ల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజావాణి కార్యక్ర మం ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరి ంచనున్నట్లు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్ అన్నారు. ఉట్నూర్ ఆసుపత్రిలో గత 13 ఏళ్లుగా ఐసీటీసీ విభాగం ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్‌లో కౌన్సిలర్‌గా పనిచేసి పదవీ విమరణ పొందుతున్న ముత్యాల తిరుపతిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డా. కపిల్ రాథోడ్, సిబ్బంది సయ్యద్ సాజిద్‌అలీ, సుభాష్, బొంకంటి, కుస్మా, శ్రీలత, అంజన్న, అమర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,450ల నగదు స్వా.దీనం చేసుకున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ పేకాట, జూదం వంటి కార్యకలాపాలు సమాజానికి హానికరమన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఆదిలాబాద్‌టౌన్: స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్‌బాబు అన్నారు. చికాగోలో 1983 సెప్టెంబర్ 11న జరిగిన సమ్మేళనాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివేకానందుడు చికాగోలో దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ లింగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిభ

ఉట్నూర్‌రూరల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. ఎంపీయూపీఎస్ చెందిన టీచర్ రవికుమార్ 5కే రన్, జెడ్పీహెచ్ఎస్ టీచర్ నిరూప్‌నాయక్ బ్యాడ్మింటన్, ఉపేందర్ క్రికెట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. ఎంఈవో ఆశన్న అభినందించారు.